క్లుప్తంగా

విశ్వరూప్ నియామకంపై హర్షం

అల్లవరం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌ని ఎంపిక చేయడంపై ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు బాపూజీ హర్షం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి విశ్వరూప్ నియామకంతో వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విశ్వరూప్‌కి పలువురు పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు.

నిరంతర భగవత్ నామస్మరణతోనే పుణ్య ఫలం



అమలాపురం టౌన్: నిరంతర భగవత్ నామస్మరణతోనే పుణ్య ఫలం దక్కుతుందని ప్రవచన కర్త పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక జానికీ రామర్స్ కళ్యాణ మండపంలో గరికిపాటి అంబరీషోపాఖ్యానంపై శనివారం రాత్రి ప్రవచనం చెప్పారు. భగవత్ ఆరాధనతోనే మానవ జీవన వికాసం సాకారమవుతుందని చెప్పారు. మానవ జీవితంలో ఏకాదశికి ఉన్న విశిష్టతను, ఆ పవిత్రమైన రోజున ఆచరించే వ్రతం విశేషాలను ఉద్బోధించారు. అంబరీషోపాఖ్యానంపై పలు ఘట్టాలను భక్తులకు వివరించారు. కార్యక్రమ నిర్వాహకుడు, ఆనంద ధార్మిక సంస్థల ప్రతినిధి అయ్యల సోమయాజుల బ్రహ్మానందం, పేరి కొండబాబు తదితరులు భక్తులకు సేవలందించారు.

మెట్టకూరులో స్వచ్ఛభారత్

యానాం: నియోజకవర్గ పరిధిలోని మెట్టకూరులో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ హైస్కూల్ సీఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో యానాం–మెట్టకూరు రహదారిలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టి పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో హెచ్ఎం పువ్వల రాజారామ్మోహన్‌రావు, పీఈటీ శేరు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు పూర్తి సహకారం

యానాం: పుదుచ్చేరి, కారైకల్, మాహే ప్రాంతాల నుంచి నర్సింగ్ విద్యను అభ్యసించేందుకు యానాం వచ్చిన విద్యార్థినులకు అన్ని విధాలా సహాయపడతానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం స్థానిక మదర్‌థెరిస్సా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో సీట్లు వచ్చిన ఆయా రీజియన్ల విద్యార్థినులు ఉండటానికి వీలుగా వసతి, భోజన సదుపాయాన్ని మల్లాడి కృష్ణారావు కల్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులు ఆయన ఇంటికి వెళ్లి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి

అమలాపురం టౌన్: స్థానిక సర్దార్ భగత్‌సింగ్ సెంటరులో భగత్ సింగ్ జయంతి కార్యక్రమం శనివారం జరిగింది. ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధా కొండ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, నల్లా అజయ్, కొత్తపల్లి వంశీ, కోన స్వామి, కల్వకొలను సత్తిబాబు, పడాల బాబు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి నుంచి ఉచిత రేషన్ బియ్యం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా దీపావళి నుంచి ఆయా రీజియన్ల పరిధిలో ఉన్న రేషన్‌షాపుల ద్వారా రేషన్‌కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నట్లు సీఎం రంగసామి శనివారం తెలిపారు. ఉచిత బియ్యం పంపిణీకి సంబంధించిన ఫైలుకు ఇప్పటికే ఆమోదం తెలిపామన్నారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా నిత్యావసరాల పంపిణీకి నిధులు మంజూరు చేస్తుందన్నారు. దీనిపై చర్చించేందుకు ప్రధాని మోదీని కలవనున్నట్లు తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం డెంగ్యూ కేసులు బాగా తగ్గించగలిగామన్నారు. వివిధ శాఖలు దోమల నివారణకు మందుల పిచికారీ వంటివి చర్యలు చేపట్టాయన్నారు. త్వరలో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ నియామకం జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచామన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

ఐ.పోలవరం: మురమళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ ఫణి పేరాజు అధ్యక్షతన శనివారం జరిగింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ సంఘానికి మంచి భవనాన్ని సమకూర్చారని, భవిష్యత్తులో సభ్యులందరూ తమ దగ్గర ఉన్న మొత్తాలను డిపాజిట్లుగా సంఘంలో పొదుపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అమలాపురం జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, డివిజనల్ సహకార అధికారి రాధాకృష్ణ, మురమళ్ల డీసీసీ బ్యాంక్ మేనేజర్ మనోహర్, సీఈవో శ్రీనివాసరావు, దాట్ల పృథ్వీరాజ్, జంపన బాబు, రైతులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం ఎస్ఐగా రాజేష్

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం మండల ఎస్ఐగా సీహెచ్ రాజేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ అమలాపురం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఉప్పలగుప్తం వచ్చారు. గతంలో అమలాపురం తాలుకా, ఎటపాక, ఐ.పోలవరం మండలాల ఎస్ఐగానూ విధులు నిర్వర్తించారు.



పల్లంకుర్రులో వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



భీమనపల్లి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు



తాళ్లరేవు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ తదితరులు



అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లోని శివాలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ఐటీ, స్టూడెంట్ విభాగాల నాయకులు

బాబుకు సద్బుద్ధిని ప్రసాదించు స్వామీ

- అమలాపురం వెంకన్నకు వైఎస్సార్ సీపీ నేతల వేడుకోలు
- ర్యాలీగా ఆలయానికి వెళ్లి స్వామికి ప్రత్యేక పూజలు
- ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేక చంద్రబాబు కుటిల రాజకీయం
- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, మాజీ ఎంపీ అనురాధ ధ్వజం



పల్లిపాలెం వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు

అమలాపురం టౌన్: తన స్వార్థ ప్రయోజనాల కోసం కలియుగ వేంకటేశ్వరుని లడ్డూ ప్రసాదం విషయంలోనూ రాజకీయం ముఖ్యమంత్రి చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని ప్రార్థిస్తూ అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు స్థానిక హైస్కూలు సెంటరులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయం వరకూ మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని చేతబట్టి ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ముఖ్య అతిథులుగా పాల్గొని చంద్రబాబు వైఖరిపై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్ తిరుపతి విశిష్టతను కాపాడితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అదే తిరుపతి వెంకన్న ప్రసాదాన్ని కూడా తన కుటిల రాజకీయానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. దాదాపు 100 కోట్ల మంది భక్తులు విశ్వసించే తిరుపతి వెంకటేశ్వరుడిని, లడ్డూ ప్రసాదాన్ని తన కుటిల రాజకీయంతో అపవిత్రం చేసిన చంద్రబాబు పాపం ఊరికే పోదన్నారు. జంతువుల కొవ్వుతో లడ్డూ ప్రసాదం తయారైందని అసత్య ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్న చంద్రబాబు కపట నాటకాన్ని కోట్లాది భక్తులు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం మండలాల పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, అమలాపురం, అల్లవరం ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, అమలాపురం, అల్లవరం జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, కొనుకు గౌతమి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి బాబు, జిల్లా పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, నాగారపు వెంకటేశ్వరరావు, బండారు గోవిందు, యండమూరి గంగ, చిత్రపు రామకృష్ణ, వంటెద్దు వెంకన్నాయుడు, ఉంద్రు వెంకటేష్, సరెళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చలేక లడ్డూ డ్రామా

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా లడ్డూ డ్రామా ఆడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శనివారం పల్లిపాలెం గ్రామంలో శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలంటూ స్వామి వారికి పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం స్వయం ప్రతిపత్తి గల సంస్థ అని అక్కడ ఏవైనా అవకతవకలు జరిగితే అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఏం సంబంధం ఉంటుందన్నారు. దేవుడిపై భక్తి భావం ఉన్న వాళ్లు మాత్రమే టీటీడీ బోర్డు సభ్యులుగా ఎంపికవుతారని, ఆ సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ చంద్రబాబు ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. సుమారు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రసాదం లడ్డూ అన్నారు. తిరుమల తిరుపతి లడ్డూపై తప్పుడు ప్రచారం చేసిన చంద్రబాబు అంతకు అంతా అనుభవిస్తాడని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చకపోవడంతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుందని, అందుకే ప్రజల దృష్టికి మరల్చేందుకు నెయ్యి కల్తీ అయ్యిందంటూ కొత్త డ్రామాకు తెర లేపారన్నారు. భగవంతునిపై రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. కార్యక్రమంలో పొన్నాడ వెంట పితాని బాలకృష్ణ, కాశి బాలమునికుమారి, పెన్మెత్స చిట్టిరాజు, కమిడి ప్రవీణ్‌కుమార్, కోలా బాబ్జి, పిన్నమరాజు శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ శంకరరావు, పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు బుద్ధి మారాలి

అమలాపురం టౌన్: తిరుపతి వేంకటేశ్వరస్వామి విశిష్టతను, లడ్డూను తన కుటిల ఆరోపణలతో అపవిత్రం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు బుద్ధి మార్చాలని ప్రార్థిస్తూ స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లోని శివాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఐటీ, స్టూడెంట్ విభాగాల నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, పార్టీ స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదటి శిరీష్, రాష్ట్ర ఐటీ విభాగ కార్యదర్శి ఉంగరాల సంతోష్, రాష్ట్ర స్టూడెంట్ విభాగ కార్యదర్శి ఆశిష్, మంగళంపల్లి ప్రదీప్, పెయ్యల సాయి, తోలేటి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోనలో..

కాట్రేనికోన: 100 రోజుల పాలనలో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టి మరల్చేందుకే తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో కుటిల రాజకీయం మొదలు పెట్టిందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని పలు ఆలయాల్లో చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. 100 రోజుల పాలనలో సూఫర్ సిక్స్ హామీలు నెరవేర్చలేకపోవడమే కాకుండా వరద బాధితులను ఆదుకోవడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం తిరుపతి లడ్డూను రాజకీయం చేసి మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై ఆరోపణలు చేయడం కాకుండా సీబీఐతో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాతి అలివేణి, నాతి సత్యనారాయణ, జీటీ వెంకటేశ్వరరావు, చీకురుమిల్లి రత్నప్రసాద్, కామాడి గంగాద్రి, వర్గాల చిన్నారావు, ఎలిపే విజయ్, నందిక నరసింహమూర్తి, వడ్డి శ్యామ్ ప్రసాద్, నందిక శ్రీను, జనిపెల్లే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బురద రాజకీయం

ఉప్పలగుప్తం: పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ జరిగిందని అసత్య ఆరోపణలు చేస్తూ చంద్రబాబు బురద రాజకీయం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని భీమనపల్లిలో ఉన్న భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం పార్టీ శ్రేణులంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను భగవంతుడు గమనిస్తున్నాడని, వారిని శిక్షించి తీరతాడని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సూరిబాబు, శీలం సూరిబాబు, రాయపురెడ్డి నాగు, యాళ్ల చిన్నా, మానే దుర్గ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

తాళ్లరేవు: కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామివారి ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ తాళ్లరేవు మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న భూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందకుమార్ మాట్లాడుతూ స్వామి వారికి, ప్రపంచంలో ఉన్న భక్తులందరికీ సీఎం క్షమాపణ చెప్పాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దళితవాడలకు వేంకటేశ్వర స్వామిని, హిందూమతాన్ని తీసుకువెళ్లాలని దళిత గోవిందం పేరు మీద రథయాత్రలు చేయించారన్నారు. అలాగే ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి కూడా కాలినడకన వెళ్లి స్వామిని దర్శించుకుని పాదయాత్ర చేశారన్నారు. అలాంటి వ్యక్తిపై ఆరోపణలు చేయించడం నీచ రాజకీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, యూత్ అధ్యక్షుడు మట్టపర్తి లోవరాజు, జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ పందిరిపల్లి రాజేష్, వైస్ ఎంపీపీలు కోపనాతి లలిత, ధూళిపూడి నాగేంద్రప్రసాద్, పెయ్యల మంగేష్, వెంటపల్లి నూకరాజు, పోతుల రత్నకుమారి, యర్రంనీడి అప్పారావు, రేకాడి నరసింహమూర్తి, పెట్ల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు ఆపండి.. నిజం నిగ్గు తేల్చండి

- ఒకే రోజు రూ.3.50 కోట్ల బిల్లులు దోచేశారంటూ ఆరోపణలు
- వాడివేడిగా అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్ మాథూర్

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం వాడివేడిగా జరిగింది. రూ.3.50 కోట్ల మేర బిల్లులు ఒకేసారి ఓచర్ల రూపంలో ఇవ్వడాన్ని కౌన్సిలర్లు తప్పుపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తొలుత అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్ తొలిసారిగా హాజరై కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యునిగా బాధ్యతలు స్వీకరించారు. సమావేశంలో ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీనివాసరావు మున్సిపాలిటీలో అధికారులు రూ.3.50 కోట్లకు సంబంధించిన బిల్లులను దోచేశారని ఆరోపించారు. దీనిపై స్పందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పాలక పక్ష కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్ ఒకే రోజు రూ.3.50 కోట్ల మేర బిల్లులు ఓచర్ల రూపంలో ఇవ్వడంపై విచారణ జరిపించి నిజం నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లులు చేసిన అధికారులు బదిలీపై వెళ్లాలని, ముఖ్యంగా పాత కమిషనర్‌ను రప్పించి మరీ విచారణ చేయిస్తేనే ఈ అవకతవకలు వెలుగు చూస్తాయని పేర్కొన్నారు. అప్పటి వరకూ బిల్లులు ఆపండని పాలక పక్ష కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర స్పష్టం చేశారు. ఈ మేరకు పాలపక్షం బిల్లులు ఆపాలని, దర్యాప్తు చేయాలంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. 2019–20లో 9వ వార్డులో జరిగిన జంగిల్ క్లియరెన్స్ పనులకు 2024 సెప్టెంబర్‌లో బిల్లు ఇవ్వడం ఏమిటని కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర నిలదీశారు. కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు, డీఈఈ నాగ సతీష్ కౌన్సిలర్లు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు.

టీడీపీ, జనసేన కౌన్సిలర్ల వాకౌట్

కౌన్సిల్‌లో వాయిదా వేసిన అంశాలకు టెండర్లు ఎలా పిలిచారంటూ టీడీపీ, జనసేన కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఒక దశలో దీనిపై అధికారులు సమాధానం చెప్పాలంటూ చైర్‌పర్సన్ పోడియాన్ని చుట్టుముట్టారు. 2, 3 వార్డుల్లో టెండర్లు నిర్వహించకుండా, కౌన్సిల్ అజెండాకు రాకుండా, తీర్మానం కాకుండానే పనులెలా జరిగాయని కౌన్సిలర్లు నాగేంద్ర, సంసాని బులినాని ప్రతిపక్షాలకు ఎదురు ప్రశ్నలు వేశారు. చివరకు టీడీపీ, జనసేన కౌన్సిలర్లు ఈ అంశాన్ని వ్యతిరేకిస్తూ సమావేశాన్ని వాకౌట్ చేశారు. మున్సిపల్ కార్యాలయం గేట్ వద్ద నిరసన తెలిపారు. తొలుత ఎంపీ హరీష్‌కు పాలక, ప్రతిపక్షాల కౌన్సిలర్లు రైల్వే అలైన్‌మెంట్‌లో మార్పులు, అమలాపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ఎప్పటిలాగే సేవలు అందించేలా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో అలైన్‌మెంట్ ఉంటుందని భరోసా ఇచ్చారు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను కొనసాగేలా చేస్తానని హామీ ఇచ్చారు.

నిర్మాణాలు పూర్తి కాకుండానే చెల్లింపులు



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ మధుసూదనరావు తదితరులు

అల్లవరం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలు పూర్తి కాకుండానే చెల్లింపులు జరుగుతున్నట్లుగా 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో అవకతవకలు బహిర్గతమయ్యాయి. శనివారం అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డ్వామా పీడీ మధుసూదనరావు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు హాజరయ్యారు. ఎస్ఆర్‌పీ కనకరావు ఆధ్వర్యంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 967 ఉపాధి పనులకు రూ.7.74 కోట్లు, పంచాయతీ పనులు రూ.3.46 కోట్లు నిధులతో చేసిన పనులకు డీఆర్‌పీలు తనిఖీ నివేదికను వివరించారు. గూడాల గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర నిర్మాణం పూర్తి కాకుండానే రూ.4 లక్షలు, డి.రావులపాలెంలో రూ.97 వేలు నిధులు చెల్లింపులు జరిగాయని గుర్తించారు. బెండమూర్లంక, గూడాల గ్రామాల్లో మొక్కలు లేవని, క్షేత్ర స్థాయిలో నిర్వహణ లోపాన్ని లేవనెత్తారు. గూడాల ఫీల్డ్ అసిస్టెంట్ జాబ్ కార్డు కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని 52 మంది ఉపాధి కూలీలు ఫిర్యాదు చేశారని డీఆర్‌పీ తన నివేదికలో పేర్కొన్నారు. ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పలు గ్రామాల్లో ఉపాధి కూలీలు వేతనాలు కోల్పోయారని ఆడిట్ బృందం స్పష్టం చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది నుంచి రూ.31,460 రికవరీ చేయాలని పీడీ మధుసూదనరావు ఆదేశించారు. పదిహేను రోజుల్లో రూ.12,26,430 విలువ చేసే పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్‌లు బొమ్ము బాలవేణి, విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, ఎంపీటీసీ మామిడిశెట్టి శ్రీనివాసరావు, ఏపీడీ సత్యనారాయణ, అంబుడ్స్‌మెన్ అడపా శ్రీనివాసరావు, ఏపీఓ శ్రీనుబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి




ఉప్పలగుప్తంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఉప్పలగుప్తం: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుని, పండంటి బిడ్డకు జన్మనివ్వాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, వైద్యాధికారి ఎల్.నాగార్జున, ఎంపీడీవో కార్యాలయ ఏఓ ఎంఎల్ఎన్ మూర్తి, ఐసీడీఎస్ సీడీపీవో కేవీఎస్‌డీ కుమారి, సూపర్‌వైజర్‌లు కె.లీలాకుమారి, ఎస్.రమాదేవి, జి.మహాలక్ష్మి, షేక్ ఉన్నీషా బేగం పాల్గొన్నారు.

అల్లవరం: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ కేడీఎల్‌డీ కుమారి ఆధ్వర్యంలో శనివారం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 31 మంది గర్భిణులకు నూతన వస్త్రాలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ మౌనిక, సూపర్‌వైజర్లు కుమారి, వెంకటలక్ష్మి, ఉన్నీషా, అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, బేబి, రామలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు అన్నారు. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పశువులంక గోడివారిపేట కమ్యూనిటీ భవనంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐ.విమల అధ్యక్షతన శనివారం పోషకాహార మాసోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ విమల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహార లోపానికి గురి కాకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందం, మండల విస్తరణాధికారులు సీహెచ్ నాగలక్ష్మి, జె.మీనాక్షి, సర్పంచ్ సఖిలే పెద్దిరాజు, ధూళిపూడి చక్రం, రాంబాబు పాల్గొన్నారు.

అమలాపురంలో ట్రాఫిక్ అవస్థలు



అమలాపురం నల్ల వంతెన వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో శనివారం రాత్రి పలు కూడళ్లలో ట్రాఫిక్ స్తంభించి వాహన చోదకులు, బాటసారులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. స్థానిక నల్ల వంతెన వద్ద దాదాపు గంట సమయం పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈదరపల్లి వంతెన వద్ద సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సాధారణంగా పెళ్లిళ్ల సీజన్‌లో పట్టణంలో ట్రాఫిక్ స్తంభించడం సహజం. అయితే శనివారం పెళ్లిళ్లు లేకపోయినా ట్రాఫిక్ నిలిచిపోవడంతో పట్టణ పోలీసులు తీవ్రంగా శ్రమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. శనివారం రాత్రి స్థానిక కలశం సెంటరులో రెండు ఆబోతులు వీరంగం చేయడంతో అక్కడా కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆబోతులు ఓ హోటల్‌లోకి దూసుకెళ్లి ఆహార పదార్థాలు, సామగ్రిని ధ్వంసం చేశాయి.

వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి టీకాలు



వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి టీకాలు వేస్తున్న డాక్టర్ వెంకట్రావు తదితరులు

అమలాపురం టౌన్: ప్రపంచ రేబిస్ వ్యాధి దినోత్సవం సందర్భంగా అమలాపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి ఆధ్వర్యంలో పెంపుడు, వీధి కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి టీకాల కార్యక్రమం శనివారం జరిగింది. స్థానిక మున్సిపల్ మార్కెట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు హాజరై రేబిస్ వ్యాధి టీకాల శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మార్కెట్ ఏరియాలో ఉన్న వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి టీకాలు వేశారు. పెంపుడు కుక్కల యాజమానులు కూడా తమ కుక్కలను తీసుకొచ్చి టీకాలు వేయించారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ కుక్క కాటు వల్ల రేబిస్ వ్యాధి మనుషులకు త్వరగా సోకుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ మార్కెట్ ఏరియాలో మొత్తం 102 కుక్కలకు టీకాలు వేసినట్లు సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారు గోవింద్, యండమూరి గంగ, లయన్స్ క్లబ్ గవర్నర్ అనిల్‌కుమార్ జైన్, లయన్స్ జిల్లా కార్యదర్శి మద్దెల వెంకటేశ్వరరావు, పశు వైద్యాధికారులు శ్రీనివాస్, నారాయణరావు, పూర్ణిమ, హెబ్సిబా తదితరులు పాల్గొన్నారు.

టీకా ద్వారా రేబిస్ వ్యాధి నివారణ

యానాం: పెంపుడు కుక్కలకు టీకా వేయడం ద్వారా రేబిస్ వ్యాధిని నివారించవచ్చని జిప్‌మెర్ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ రేబిస్ డేను పురస్కరించుకుని జిప్‌మెర్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఏటా రేబిస్ డేను నిర్వహిస్తారన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ 2030 నాటికి కుక్కల ద్వారా సంభవించే మరణాలను పూర్తిగా రూపుమాపాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

గ్రామస్తుల ఆర్థిక సాయం

ఉప్పలగుప్తం: ఇటీవల గొల్లవిల్లి గ్రామంలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన గుత్రాల అక్కిరాజు కుటుంబసభ్యులకు స్థానిక గ్రామస్తులు శనివారం ఆర్థిక సహాయం చేశారు. స్థానిక గ్రామ పంచాయితీ పరిధి అంబేడ్కర్ నగర్ వాసులు రూ.14,210 నగదును అక్కిరాజు ఇంటి వద్ద అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన మాధవి



బాధ్యతలు స్వీకరిస్తున్న అమలాపురం ఆర్డీవో మాధవి

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్డీఓగా మాధవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమె బదిలీపై అమలాపురం ఆర్డీఓగా వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు ఆర్డీఓ కార్యాలయ అధికారులు, తహసీల్దార్లు కలిసి అభినందించారు. ఇప్పటివరకూ ఆర్డీఓగా పనిచేసిన కేశవవర్ధన్‌రెడ్డి కనిగిరి ఆర్డీఓగా బదిలీ అయ్యారు.